క్లుప్తంగా

సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి



గుడివాడరూరల్: సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు నెలవు అని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండలంలోని బొమ్ములూరు సమీపంలోని టిడ్కో సముదాయం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు, తెలుగు యువత అధ్యక్షుడు వాసే మురళీ, కర్రే వెంకటగిరి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలను ఆయన పరిశీలించారు. కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, లింగం ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు



పామర్రు: స్థానిక విష్టాలయంలో వేంచేసి యున్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా గోదాదేవి రంగనాథ స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అశోక్ శ్యామలా దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు భక్తులు బొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, వేణుగోపాల స్వామి, దేవి, సుశీల, విజయలక్ష్మీ పాల్గొన్నారు.
నేడు గోదాదేవి రంగనాధుల కల్యాణోత్సవం పామర్రు మండలంలోని పలు వైష్ణవ ఆలయాల్లో సోమవారం గోదాదేవి, రంగనాథ స్వామి కల్యాణోత్సవాలను నిర్వహించనున్నారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి అధికమైంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఏర్పాట్లు చేశారు.

ఉచిత వైద్యశిబిరం



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రోగులకు గుడివాడకు చెందిన వైద్యురాలు గవిర్నేని రజినీ వైద్య పరీక్షలు చేశారు. దాతలు నర్రా గంగాధరరావు(వెస్టిండీస్), కొసరాజు బాపయ్యచౌదరి, వల్లభనేని రామకృష్ణ ఆర్థిక సాయంతో ఈ శిబిరం నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

జోరుగా కోడి పందేలు



గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరంలో కోడి పందేల బరి ఆదివారం తెరచుకుంది. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరిలో ఒక్కో పందెం రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల చొప్పున నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏ పందేల బరి కూడా ఇంతవరకు నిర్వహించక పోవటంతో ఈ బరికి వేలాది మంది పందెపురాయుళ్లు విచ్చేశారు.

చిన్నారులకు భోగిపళ్లు



గుడ్లవల్లేరు: భోగి పండుగను పురస్కరించుకుని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం రాత్రి చిన్నారులకు మహిళలు భోగి పళ్లను పోశారు. సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భళారే భళ.. బసవన్నల విన్యాసాలు

ఆకట్టుకుంటున్న గంగిరెద్దుల కళాకారులు



ఎద్దు నోటిలో ఆటగాడి తల



అయ్యగారికి దండం పెట్టు..



ఆటగాడి గుండెల మీద కాళ్లతో తొక్కుతున్న ఎద్దు



ఆటగాళ్లకు నగదును ఇస్తున్న దాత

గుడ్లవల్లేరు: తెలుగు సంస్కృతికి డూడూ బసవన్నల విన్యాసాలు అద్దం పడుతున్నాయి. సంక్రాంతి నెలలో డూడూ బసవన్నలతో ఆటగాళ్ల పల్లెల్లోని గడప గడపకూ తిరుగుతున్నారు. ఆకర్షణీయంగా అలంకరించిన తమ ఎద్దులతో ఆటలు ఆడిస్తున్నారు.
గుడ్లవల్లేరు మండలంలోని వివిధ గ్రామాల్లో గంగిరెద్ల కళాకారులు తమ ఎడ్లతో విన్యాసాలు చేయించి అందర్నీ ఆకర్షిస్తున్నారు. గంగిరెద్దుల విన్యాసాలను చిన్నారులు, వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండా వీక్షిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను కళ్లు పక్కకు తిప్పనీయకుండా కళాకారులు అలరిస్తున్నారు. ప్రాణాంతకమైన ఈ విన్యాసాలు చూపరులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

విన్యాసాలకు కఠోర శిక్షణ



ఎద్దులతో చేసే ఈ విన్యాసాలకు ఎంతో కఠోరమైన శిక్షణ ఉంటుంది. కొంచెం ఎద్దు అదుపు తప్పిందంటే మన మాట వినదు. దానిని అదుపు చేయటం పది మంది ఉన్నా సేరే ఎవరి తరం కాదు. చాలా జాగ్రత్తగా విన్యాసాలతో సంక్రాంతికి సందడి చేసి, అందరికీ సరదా పంచుతున్నాం.

– బాజీ, యువ కళాకారుడు

పూర్వీకుల నుంచి ఇదే వృత్తి



మా పూర్వీకుల నుంచి ఇదే వృత్తిలో ఉంటున్నాం. నెల గంట పట్టాక ఈ వృత్తి చేస్తాం. ప్రవృత్తి మాత్రం వ్యవసాయమే. సంక్రాంతి వరకూ జిల్లాలోని పెడన, మచిలీపట్నం, బంటుమిల్లితో పాటు గుడివాడ, గుడ్లవల్లేరు పరిసర ప్రాంతాల్లో ఏటా తమ ఎద్దులను ఆడిస్తాం.

– వీరయ్య, సీనియర్ కళాకారుడు

కోడి పందేల శిబిరం ధ్వంసం

పామర్రు: కోడి పందేలు, జూదాలను నిర్వహిస్తే సహించేది లేదని పామర్రు ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కొత్త పెదమద్దాలిలో ఏర్పాటు చేస్తున్న కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం చేసిన స్థలాన్ని ఆదివారం ట్రాక్టర్‌తో దున్నించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరికీ కోడి పందేలు, జూదాలు నిర్వహించేందుకు ఏవిధమైన అనుమతులు లేవన్నారు.

జూద శిబిరాల ఏర్పాట్లను అడ్డుకున్న పోలీసులు

గుడివాడరూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని జూదాలు నిర్వహించేందుకు అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేస్తున్న జూద శిబిరాలను గుడివాడ తాలూకా పోలీసులు ఆదివారం అడ్డుకుని టెంట్లను తొలగించారు. మండలంలోని బొమ్ములూరు టిడ్కో సముదాయం వద్ద, వలివర్తిపాడు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న శిబిరాలను గుడివాడ తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. ఎస్ఐ ఎన్.చంటిబాబు, పోలీసులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న కోడిపందాల బరులను రూరల్ సర్కిల్ ఎస్ఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో పలు మండలాల్లో ఆదివారం ధ్వంసం చేశారు. కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు గోనెపాడు, భుజబలపట్నం గ్రామాల్లో జూదాలు వద్దని అవగాహన కల్పించారు. శృంగవరప్పాడు, కొట్టాడ గ్రామాల్లో బరులను ధ్వంసం చేశారు. మండవల్లి ఎస్ఐ సీహెచ్.రామచంద్రరావు ఆధ్వర్యంలో లోకుమూడి, చావలిపాడు, ఇంగిలిపాకలంక గ్రామాల్లో బరుల వద్ద టెంట్లను తొలగించారు. కలిదిండి ఎస్ఐ వి.వేంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోతుమర్రు, గొల్లగూడెం గ్రామాల్లో బరులను ధ్వంసం చేశారు. తాడినాడ శివారు సున్నంపూడిలో పేకాట నిర్వహిస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకుని, వారివద్ద నుంచి రూ.32,100 నగదును సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు సాయం అందజేత



విద్యార్థులకు సాయం అందజేస్తున్న క్షత్రియ పెద్దలు

కైకలూరు: క్షత్రియ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వృద్ధులు, విద్యార్థులకు పింఛన్లు, స్కాలర్‌షిప్‌లను అందజేశారు. స్థానిక బృందవనం లాడ్జిలో ఆదివారం జరిగిన సమావేశంలో 105 మంది వృద్ధులకు పింఛన్ నిమిత్తం రూ.1,89,000, ఇద్దరు మెడికల్ విద్యార్థులతో సహా 40 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లుగా రూ.1,83,000 అందించారు. అదే విధంగా నడింపల్లి మూర్తిరాజు విద్యార్థులకు రూ.2లక్షలు, వృద్ధులకు దుప్పట్లుతో పాటు రూ.21,000, నంబూరి వెంకటపతిరాజు ముదునూరి మమతావర్షిణీకి రూ.40,000, అదే విధంగా ఇందుకూరి సత్యనారాయణరాజు వృద్ధులకు చీరలు, పంచెలను అందించారు. అనంతరం దండు నాగరాజు, రామరాజు, కనుమూరి పాండురంగరాజు, పెన్మత్స రామరాజు(కేఆర్ఎఫ్), గొట్టుముక్కల ప్రసాదరాజు, పొత్తూరి నరసింహారాజు రూ.55,000 పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు పేరిచర్ల రామరాజు, సెక్రటరీ ఆర్‌వీఎస్.సూర్యనారాయణ రాజు, ట్రెజరర్ పీవీ.నరసింహారాజు, క్షత్రియ పెద్దలు జంపన సీతారామరాజు, దండు ప్రసాదరాజు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలి



భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

కైకలూరు: చిన్నారులకు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేయాలని అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ తల్లిదండ్రులకు సూచించారు. గుడివాడ రోడ్ దత్తాశ్రమానికి ఆదివారం రాత్రి ఆయన విచ్చేసి, భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. దత్తాశ్రమంలో ఆంజనేయస్వామి గుడి నిర్మించాలని నిర్వాహకులను స్వామిజీ ఆదేశించారు. ఎంపీపీ అడవి కృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు గురజాడ ఉదయశంకర్, కృష్ణారావు, ప్రభాకరదీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన నాగమల్లి



భుజబలపట్నం శివాలయం వద్ద విరబూసిన నాగమల్లి పుష్పాలు

కైకలూరు: శివార్చనకు అత్యంత ప్రీతిపాతమైన నాగమల్లి పుష్పాలు విరబూశాయి. కైకలూరు మండల భుజబలపట్నం భీమేశ్వరస్వామి శివాలయం ముందు చెట్టుకు పూసిన పూలు అందరినీ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నాగుపాము పడగ విప్పినట్లుగా ఉంటూ లోపల లింగాకారం కనిపించడం ఈ పుష్పం విశిష్టత.

కోడి పందేలకు బరులు సిద్ధం

తోట్లవల్లూరు: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేల నిర్వహణకు బరులు సిద్ధమయ్యాయి. పండుగ మూడు రోజులు కోడిపందేలు, జూదం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు టీడీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తోట్లవల్లూరుతోపాటు వల్లూరుపాలెం, గరికపర్రు, కుమ్మమూరు గ్రామాల్లో కోడిపందేల బరులను నాయకులు ఏర్పాటు చేశారు. ఆయా బరుల వద్ద పసుపు జెండాలు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం

మండవల్లి: స్థానిక ఆర్సీఎం చర్చి పక్కన ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామ పంచాయతీ నిధులు రూ.లక్ష, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో ఈ రోడ్డు నిర్మించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, పీఆర్ ఏఈ నాని, కార్యదర్శి సాయిప్రదీప్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీరామ్, శివ, సుబ్రహ్మణ్యం, భక్తినాదం పనులను పరిశీలించారు.

నేరాలకు దూరంగా ఉండాలి



గుడివాడరూరల్: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని నేరాలకు దూరంగా క్రమ శిక్షణతో జీవించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు దొంగతనాలు, గొడవలు, అక్రమ మద్యం అమ్మకాలు, మారకద్రవ్యాల అమ్మకాల వంటివాటితో పాటు కోతముక్క, కోడి పందేలకు దూరంగా ఉండాలని సూచించారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సొసైటీ అధ్యక్షుడిగా రామకృష్ణ



గుడివాడ టౌన్: ది గుడివాడ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడిగా పొన్నూరు రామకృష్ణ ఎన్నికయ్యారు. స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం జరిగిన సొసైటీ కార్యవర్గ సమావేశంలో రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రామకృష్ణ ఎంపికపై సొసైటీ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వరరావు (గుప్తా), కోశాధికారి దివి. రమేష్, ఉపాధ్యక్షుడు గాదం ఆదినారాయణ అభినందించారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారి పుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు.

బైండ్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడికి సన్మానం



పాపారావును సన్మానించిన పెద్దిరాజు

గుడ్లవల్లేరు: బైండ్ల సంక్షేమ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మందపాటి పాపారావుకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజు ఘనంగా సన్మానం చేశారు. ఆదివారం గుడ్లవల్లేరు, చినగొన్నూరులో పర్యటించిన పాపారావుకు తమ కుల సంఘస్తుల సమస్యలను పెద్దిరాజు విన్నవించారు. కార్యక్రమంలో ఆ సంఘ ప్రధాన కార్యదర్శి సురేష్, రాష్ట్ర కోశాధికారి గురవయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడాలి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోటప్రోలు నాగు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: చిగురుకోటలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి రూ.13,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పేకాట, కోడిపందేలు, ఇతర జూదాలు ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఘనంగా వివేకానంద జయంతి



కైకలూరులో వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణ సేవాసమితి సభ్యులు



వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ బండారు, సాయినాథ్, విజయ్ శ్రీనివాస్

కైకలూరు: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎన్జీవోస్ కాలనీలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్‌లోని వివేకానంద విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచారక్ విశ్వనాథ్, మూర్తి, రామరాజు, ఫణీంద్ర, జగన్నాథం, రాజేశ్వరరావు, ఆంజనేయులు, న్యాయవాది పాములు పాల్గొన్నారు. చటాకాయిలో వివేకానంద విగ్రహానికి నివాళులర్పించినవారిలో బలే సత్యనారాయణ, సత్యనారాయణ, జగపతి పాల్గొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి శాఖా గ్రంథాలయంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సింగలూరులోని యువజన దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భాగ్యవిధాత చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిథులుగా ఆస్ట్రేలియాకు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ పి.సాయినాథ్, హైదరాబాదుకు చెందిన ఏపీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జి.విజయ్ శ్రీనివాస్ విచ్చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చినముత్తేవిలో నాటి ఉపాధ్యాయులను సత్కరించిన పూర్వ విద్యార్థులు



మండవల్లి హైస్కూల్లో కలిసిన 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



అంగలూరు డైట్‌లో పూర్వ విద్యార్థుల కలయిక



కౌతవరం హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చోరగుడిలో 2003-04 బ్యాచ్ విద్యార్థులతో గురువులు

చినముత్తేవి(మొవ్వ): మొవ్వ మండలం చినముత్తేవి జిల్లా పరిషత్ హై స్కూల్లో 1982–1983 విద్యా సంవత్సరంలోని పదో తరగతి విద్యార్థుల సందడితో ఆదివారం పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. అప్పట్లో ఆ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగనబోయిన అంజయ్య(లెక్కల మాస్టారు), వీవీ కృష్ణారావు(సైన్స్ మాస్టరు) ఘనంగా సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు. తొలి మూడు స్థానాలు సాధించిన పోతుల అనన్య, మమత, లక్ష్మి దుర్గలకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా హాజరై బహుమతులను అందజేశారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, ముక్తేశ్వరరావు, బసవపున్నయ్య పర్యవేక్షణలో నిర్వహించారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఆదివారం 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. ఆనాటి గురువులు, విశ్రాంత ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ లక్ష్మీనరసింహారెడ్డి, తెలుగు గ్రేడ్ వన్ జానకిరామయ్య, మహాలక్ష్మి, డ్రాయింగ్ టీచర్ ఎల్ఎస్ భాస్కరరావు, ఎస్‌జీటీబీ ఏ రత్నకుమార్, ల్యాబ్ అసిస్టెంట్ అట్లూరి వెంకటేశ్వరరావు, అప్పటి విద్యాకమిటీ చైర్మన్ సత్తిబాబు, ప్రస్తుత హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తానని కొల్లా శ్రీనాథ్ అనే పూర్వ విద్యార్థి ప్రకటించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో 1987–88 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. అలాగే కౌతవరం శ్రీ కానూరి దామోదరయ్య జెడ్పీ హైస్కూల్లో 1998–99 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. పూర్వ విద్యార్థులంతా తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

చోరగుడిలో..

పమిడిముక్కల: చోరగుడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కుటుంబసమేతంగా ఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, ఆనాటి తీపి గుర్తులను, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుటూ ఉత్సాహంగా గడిపారు. హైస్కూల్ అభివృద్ధికి రూ.10 వేలు విరాళం అందజేశారు. హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగవల్లుల పోటీలు



రంగవల్లుల పోటీల్లో విజేతలకు నగదు అందజేసిన ఎమ్మెల్యే కుమార్‌రాజా



వడాలిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈఓ

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి నాట్య కళాపీఠంలో గొట్టిపాటి సాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా విచ్చేశారు. రంగువల్లుల పోటీల్లో మొదటి బహుమతిని వి.విజయకుమారి (పెదపూడి), రెండో బహుమతిని బి గౌరీమహతి (కూచిపూడి), మూడో బహుమతిని జే సాయిభారతి (కూచిపూడి) గెలుచుకున్నారు. వీరికి వరుసగా రూ.10,000, రూ.5,000, రూ.2,500ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గొట్టిపాటి సాయి, స్రవంతి దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరావు, వైపీ ఫణికుమార్ పాల్గొన్నారు.

వడాలిలో..

ముదినేపల్లి రూరల్: వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయం వద్ద మహిళలకు ఆదివారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఈ పోటీలు పర్యవేక్షించారు. విజేతలకు ఈఓతో పాటు టీడీపీ నేత వీరమల్లు నరసింహారావు, ఆలయ అర్చకులు బహుమతులు అందజేశారు. ధనుర్మాస ఉత్సవాలు, భోగి పండుగ సందర్భంగా సోమవారం ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.